క్లుప్తంగా

పిడుగురాళ్ల సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న ఏటీ రాజ్యలక్ష్మికి నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారంపై తాత్కాలిక సస్పెండ్ విధించినట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా డీఐజీ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. పిడుగురాళ్ల పట్టణానికి చెందిన ఒక స్థలాన్ని పొలంగా మార్చి రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంపై మరో వ్యక్తి కోర్టును ఆశ్రయించటంతో పిడుగురాళ్ల సబ్ రిజిస్ట్రార్ ఏటీ రాజ్యలక్ష్మిపై రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. విచారణలో నిషేధిత జాబితాలో ఉన్న భూములకు రిజిస్ట్రేషన్ జరిగినట్లు నిర్ధారించటం జరిగిందని, ప్రస్తుతానికి విచారణ మరింత లోతుగా నిర్వహిస్తున్నారు. తాత్కాలికంగా సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో శుక్రవారం అమరావతి నుంచి బుజ్జిబాబు పిడుగురాళ్ల ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ విషయమై డీఐజీ శ్రీనివాసరావును సాక్షి వివరణ కోరగా.. పిడుగురాళ్ల పట్టణానికి చెందిన నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ జరిగినట్లు సమాచారం రావటంతో సబ్ రిజిస్ట్రార్ రాజ్యలక్ష్మిపై విచారణ చేపట్టి, ప్రస్తుతానికి సస్పెండ్ చేసినట్లు డీఐజీ శ్రీనివాసరావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం

రెంటచింతల: స్థానిక శివాలయం సమీపంలో వేంచేసిన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం స్వామివారి 331వ ఆరాధన మహోత్సవ వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. వేద పండితులు బ్రహ్మశ్రీ కొండూరి మధు సూధనాచార్యులు నేతృత్వంలో స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి గణపతి పూజ, పుణ్యాహవాచనం, అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలకు సన్మార్గమును చూపించి.. జ్ఞానాన్ని బోధించిన మహాజ్ఞాని.. రాబోయే కాలంలో జరిగేవి ముందుగానే చెప్పిన కాలజ్ఞాని.. దైవాంశ సంభూతుడు అయిన స్వామివారు 1693 వైశాఖ శుద్ధ దశమి నాడు సజీవ సమాధి నిష్ఠ వహించిన రోజు.. ప్రతి ఏటా స్వామివారి ఆరాధన మహోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భిక్షాచారి, వెంకటేశ్వరాచారి, వెంకటాచారి, నర్సింహాచారి, లక్ష్మీనారాయణాచారి, లక్ష్మాచారి, కోటేశ్వరరావు, బాలుచారి, రవిచారి, బ్రహ్మాచారి, పోతులూరయ్యాచారి, విశ్వరూపాచారి, సిద్ధయ్యాచారి, శివ, బ్రహ్మం, మల్లయ్య, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రెంటచింతల: మండల పరిధిలోని వివిధ గ్రామాలలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ట్రాన్స్‌కో ఏఈ షేక్ మస్తాన్‌వలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు రెంటచింతల, పాలువాయి, మంచికల్లు, జెట్టిపాలెం గ్రామాలలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లు, విద్యుత్ లైన్‌లలో మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు అధికారులకు సహకరించాలని ఏఈ కోరారు.

గురజాలలో...

గురజాల : విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పెండింగ్ సమస్యలు పరిష్కరించేందుకు శనివారం విద్యుత్ కోత నిర్వహించడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ మస్తాన్ వలి తెలిపారు. గురజాల నగర పంచాయతీతో పాటు మండల పరిధిలోని గ్రామాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

మాచర్లలో...

మాచర్ల: పట్టణ పరిధిలో దుర్గి, వెల్దుర్తి, రూరల్ ప్రాంతాల్లో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మాచర్ల సబ్ డివిజన్ ఏఈ జె.హరిబాబు, డీఈ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

చెట్టుపై నుంచి పడి యువకుడు మృతి

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): కొబ్బరి చెట్టు ఎక్కి జారి పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో శుక్రవారం జరిగింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన కాకంగి వెంకట నవీన్‌కుమార్(23) కొబ్బరి కాయలు కోసేందుకు చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తూ జారి పడి తీవ్రగాయాలు కావటంతో చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.హజరతయ్య తెలిపారు.

క్రోసూరులో కొనసాగుతున్న 144 సెక్షన్

క్రోసూరు: క్రోసూరు మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఉన్నతాధికారుల నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగుతుందని ఎస్ఐ ఎం.షఫీ శుక్రవారం తెలిపారు. నలుగురు ఒకచోట గుమికూడరాదని, అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

డెంగీ నివారణకు పాటుపడదాం

వైద్యాధికారి కృష్ణారెడ్డి


డెంగీపై అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ, ఆరోగ్య, మలేరియా సిబ్బంది

రెంటచింతల: డెంగీ లేని పౌర సమాజం కోసం పాటుపడదామని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ, ఆరోగ్య, మలేరియ సిబ్బంది, ఆశా కార్యకర్తలతో కలిసి మండల కేంద్రం రెంటచింతలలోని పురవీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ డెంగీ దోమకాటు వల్ల వస్తుందన్నారు. పరిసరాల పరిశుభ్రత, దోమ కాటు ద్వారా వ్యాపించే వివిధ రకాల వ్యాధులను వివరించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కచ్చితంగా దోమ తెరలు వాడాలన్నారు. డెంపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు జాతీయ డెంగీ దినోత్సవం ప్రతి ఏటా ప్రభుత్వం నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ హేమ, మలేరియా విస్తరణ అధికారి చెన్నంశెట్టి అంకమ్మరావు, సీహెచ్‌వో ఏడీ శర్మ, హెల్త్ సూపర్ వైజర్‌లు కోటేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది లక్ష్మీప్రసన్న, డి.సీతారామిరెడ్డి, మహేష్, కాశీం, ఆరోగ్య, మలేరియా, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దుక్కులు లోతుగా దున్నుకోవాలి


ట్రాక్టర్‌తో దుక్కులు దున్నుతున్న దృశ్యం


వ్యవసాయాధికారి అహ్మద్

అమరావతి: మండలంలోని రైతాంగం భూమిని లోతుగా దున్ను కుంటే వర్షపు నీరు లోపలికి బాగా ఇంకి, పైర్ల వేర్లు భూమిలోకి చొచ్చుకుపోయి ఎక్కువ పోషకాలను గ్రహించే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి అహ్మద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తేలిక నేలల్లో సేంద్రియ పదార్థం తక్కువగా ఉండడం వల్ల తేమ ఎక్కువ కాలం నిల్వ ఉండదన్నారు. పశువులు, జీవాల ఎరువు, పంట వ్యర్థాలు వంటివి వాడటం వల్ల భూమి గుల్లబారి తేమ, పోషక పదార్థాలను పట్టి ఉంచే శక్తి పెరుగుతుందన్నారు. వేసవి దుక్కి తరువాత నీటి వసతి ఉన్న ప్రాంతాలలో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుంటే భూసారం పెరుగుతుందన్నారు. నీటి పరివాహక ప్రాంతాలలోని భూములలో వాలుకు అడ్డంగా దున్నటం వల్ల నేల కోత నివారించటమే కాక భూమి భౌతిక లక్షణాలు మెరుగుపరచవచ్చన్నారు. కాంటూరు సేద్యం పద్ధతిలో వాలుకు అడ్డంగా గట్లు ఏర్పాటు చేసి వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. 2 నుంచి 7 శాతం వాలు కలిగిన భూములకు ఈ పద్ధతి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోండి

సాగులో రైతులు భూసార పరీక్షలు చేయించి నివేదిక ననుసరించి ఎరువులు వాడితే వచ్చే ఖరీఫ్ సీజన్‌లో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి అహ్మద్ అన్నారు. రైతులు భూమిలో రసాయన సమతుల్యత కోసం భూసార పరీక్షలు చేయించుకోవాలని కోరారు. రైతులు తమ పొలంలో కాలువల సమీపంలో, చెట్లకింద కాకుండా నాలుగు చోట్ల సుమారు కేజీ పరిమాణంలో మట్టి సేకరించాలన్నారు. అలాగే తాము గతంలో వేసిన పంట, భవిష్యత్‌లో వేయబోతున్న పంట సమాచారం ఇవ్వాలన్నారు. రైతు పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాలలో అందజేయాలన్నారు. భూసార పరీక్షల నివేదికను సుమారు 15 రోజులలోగా రైతులకు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు వినియోగించుకోవాలని కోరారు.

కొనసాగుతున్న 144 సెక్షన్



కారెంపూడి: అల్లర్లు, విధ్వంసకాండల నేపథ్యంలో కారెంపూడిలో మూడవ రోజు శుక్రవారం కూడా నిశ్శబ్దం నెలకొంది. సాధారణ పౌర జీవనం ఇంకా పునరుద్ధరణ కాలేదు. షాపులన్నీ పూర్తిగా మూసివేసే ఉన్నాయి. మండలంలో మూడవ రోజు 144 సెక్షన్‌ను పోలీస్ అధికారులు అమలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన పోలీస్ పహారా కొనసాగుతోంది. కారెంపూడిలో వాహనాల తనిఖీలతో రాకపోకలపై పూర్తి నిఘా కొనసాగుతోంది. అడుగడుగునా పోలీస్ బలగాలు ప్రజల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్నాయి. గత మూడు రోజులుగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోక పోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. పరిస్థితులు తొందరగా కుదుటపడాలని ఆకాంక్షిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల రాకపోకలు మాత్రం కొనసాగుతున్నాయి. శుక్రవారం పోలీసులు మరింత కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే కారెంపూడిలో అల్లర్లు, విధ్వంసాలకు సంబంధించిన కేసుల దర్యాప్తు ముమ్మరంగా జరుగుతోంది.

ఐటీఐకు దరఖాస్తుల ఆహ్వానం

మాచర్ల: పట్టణంలోని రెసిడెన్షియల్ ఐటీఐలో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సి.హెచ్.ప్రసాద్‌బాబు శుక్రవారం తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన వారిలో ఆసక్తి ఉన్న వారు ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శనివారం నుంచి మాచర్ల ఐటీఐలో ఎలక్ట్రికల్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ డీజిల్, వెల్డర్ తదితర కోర్సుల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూన్ 6న దరఖాస్తు చేసుకున్న వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఐటీఐ కళాశాలలో రశీదు పొందాలన్నారు. జూన్ 18 నుంచి 26వ తేదీ వరకు ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు మాచర్ల ఐటీఐ, జిల్లా కన్వీనర్ ప్రసాద్‌బాబును సంప్రదించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం


వడ్డవల్లి కూరగాయల మార్కెట్ వద్ద వీరబ్రహ్మేంద్ర స్వామి

సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి కూరగాయల మార్కెట్ వద్ద వేంచేసి ఉన్న శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయంలో ఆరాధన మహోత్సవాలను సత్తెనపల్లి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు పోతులూరయ్యాచారి మాట్లాడుతూ.. కాలజ్ఞాన రచయిత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 331వ ఆరాధన మహోత్సవం నిర్వహించడం ఎంతో ఆనందదాయకంగా ఉందన్నారు. అయితే పల్నాడు జిల్లాలో 144 సెక్షన్ కొనసాగుతున్న నేపథ్యంలో అన్నదాన కార్యక్రమం జరుపుకోలేకపోయామన్నారు. అనంతరం పోతులూరయ్యకు విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు చిరు సత్కారం చేశారు. కార్యక్రమంలో అద్దంకి శ్రీనివాసాచారి, మహంకాళి శ్రీనివాసరావు, అత్తలూరు కోటేశ్వరరావు, తిప్పర్తి శంకరరావు, దాసు భాస్కరాచారి, కోటగిరి గోపి, రంగు నాగభూషణాచారి, మహంకాళి భాస్కర్, యరోజు సత్యనారాయణ, సిద్దు ఆంజనేయులు, ఏలూరి శివాచారి, ఆంజనేయులు, గోపిక తిప్పర్తి మధులత, మహంకాళి పార్వతి, దాసు కల్పన, కోటగిరి చంద్రకుమారి తదితర భక్తులు పాల్గొన్నారు.

శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమంలో...

పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గల శ్రీ సనారి వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమంలో శుక్రవారం వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన వైభవోపేతంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం సుప్రభాత సేవ, మల్లెపూలతో ప్రత్యేక అర్చన, జీవ సమాధి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన సందర్భంగా ఆశ్రమ వంశపారంపర్య ధర్మకర్త మఠాధిపతులు చింతాడ లలితాంబ మాతాజీ అనుగ్రహ భాషణం చేశారు.

అప్రమత్తంగా ఉంటే రక్తపోటును నియంత్రించవచ్చు

- ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా ర్యాలీ


జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యశాఖ అధికారులు, సిబ్బంది

నరసరావుపేట: ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటే రక్తపోటు (హైపర్ టెన్షన్)ను నియంత్రించుకోవచ్చని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. ప్రపంచ హైపర్‌టెన్షన్ డే సందర్భంగా శుక్రవారం ప్రజలకు అవగాహన నిమిత్తం పల్నాడు రోడ్డులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంలో రక్తప్రసరణ సజావుగా లేక హెచ్చుతగ్గుల వలన బీపీ వస్తుందన్నారు. షుగర్ కంటే ప్రమాదకరమైన వ్యాధి అని వైద్యులు చెపుతున్నారన్నారు. ముప్పై నుంచి 35ఏళ్ల వయస్సు దాటిన ప్రతి ఒక్కరూ తెలుసుకుని తగు నియంత్రణలో ఉంచుకోవాలని కోరారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ బీపీ రాకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, కోపం, రోషం, ద్వేషం, ఆవేశం, గాబబరా, వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ప్రతీ చిన్న విషయానికి ఇతరులతో వాదించటం పెట్టుకోకూడదన్నారు, ఆలోచనలో స్పష్టత ఉండాలని, ఒంట్లో నీరు ఎప్పుడూ ఉండే విధంగా మంచి నీళ్ల తాగుతుండాలని, ఉప్పు పూర్తిగా మానేయకుండా అతికొద్ది పరిమాణంలో మాత్రమే తీసుకోవాలని సూచించారు. శరీరానికి వ్యాయామం ఉండాలని అన్నారు. రోజు విడిచి రోజైనా ఒళ్ళంతా మంచి ఆయిల్‌తో మసాజు చేసుకోవాలని, కడుపునిండా తినకుండా 15–20 శాతం ఖాళీ ఉండేలా ఆహారం తీసుకోవాలని అన్నారు. తల తిరగడం, కళ్ళు మసకబారడం, నీరసం, వంటివి లో బీపీ లక్షణాలని, విపరీతమైన తలనొప్పి, జ్వరం, అలసట వంటివి హై బీపి లక్షణాలన్నారు. మాత్ర ప్రభావం 12 లేదా 24 గంటల కంటే ఎక్కువ ఉండదని, కనుక బీపీ ఉన్నవారు ఒక్కరోజు కూడా మానకుండా ఖచ్చితంగా నిర్ణీత సమయాల్లో మాత్రలు వేసుకోవాలని సూచించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.హనుమకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తపోటుపై అవగాహన కలిగి ఉండాలి

ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్



గుడిపాడు(క్రోసూరు): రక్తపోటుతో జాగ్రత్తగా ఉండాలని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్ అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా ఆయన మండలంలోని గుడిపాడు ఆరోగ్య ఉప కేంద్రంలో ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. తరచుగా బీపీ చెక్ చేయించుకుంటా, క్రమం తప్పకుండా బీపీకి మందులు వాడుతుంటామని, వైద్య అధికారుల సూచనల మేరకు జీవన శైలిలో మార్పులు చేసుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ దివ్య మాట్లాడుతూ వ్యాయామం, ఆహారంలో ఉప్పు, కారం తగ్గించడం, మద్యపానం, ధూమపానం మానుకోవటం వంటివి హై బీపీ నియంత్రణకు ఉపకరిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త ఝాన్సీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కల్యాణ మహోత్సవాలు



యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీభూసమేత రంగనాయస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు వారంరోజులు పాటు కొనసాగుతాయని ఆలయ ప్రధాన అర్చకులు పర్చూరి రామకృష్ణమాచార్యులు తెలిపారు. అలాగే 22వ తేదీన భూదేవర్లతో రంగనాయకస్వామి వార్ల కల్యాణ వేడుక కన్నుల పండువగా జరుగుతుందని తెలిపారు. ఆలయ వంశాపారంపర్య ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్, నాగజ్యోతి దంపతులు, బ్రదర్స్ పర్యవేక్షిస్తుండగా, సొలస గ్రామపెద్దలు సహకారం అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు గ్రామస్తులే కాకుండా సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

ఆటోను కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

నాదెండ్ల: ఆగి ఉన్న ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలైన సంఘటన గణపవరం గ్రామంలో జాతీయ రహదారి వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలోని సీఆర్ కళాశాల సెంటర్‌లో ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆటో ఆగి ఉంది. అదేసమయంలో గుంటూరు నుండి చిలకలూరిపేట వైపు వెళ్తున్న కారు ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలోని ఇరువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఇరువురినీ ప్రైవేటు వాహనంలో చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించారు.

స్వర్గీయ డాక్టర్‌వైఎస్సార్‌కు నివాళులు



క్రోసూరు: క్రోసూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు గార్లపాటి దాసు శుక్రవారం కడప జిల్లా ఇడుపులపాయ వద్ద దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధిని సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ వైఎస్సార్ సమాధిపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

నేడు వాసవీ అమ్మవారి జన్మదిన వేడుకలు


వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు


చైర్మన్ కట్టమూరి నాగేశ్వరరావు

రెంటచింతల: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి 4641 వ జన్మదిన వేడుకలు శనివారం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం దేవస్థానంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రేష్ఠి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు అమ్మవారి దేవస్థానంలో లలిత, విష్ణు సహస్ర నామ పారాయణ, 6.30 గంటలకు పతాక ఆవిష్కరణ, 10 గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పాలాభిషేకం, 102 మంది మహిళలచే కుంకుమ పూజ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారి లడ్డు వేలంపాట దేవస్థానంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి కోలాట భజన బృందం మేళతాళాలతో అమ్మవారి పతాకాలను చేబూని కీర్తనలను ఆలపిస్తూ రెంటచింతల గ్రామ పురవీధులలో భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సూక్ష్మ పోషకాలపై అవగాహన కల్పించాలి

రెంటచింతల: పంటలను సాగు చేసే ముందు భూసార పరీక్షలు చేయించుకుంటే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, దీంతో వారికి ఆ భూములలో సూక్ష్మ పోషకాలపై ఒక అవగాహన ఉంటుందని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం సాగుకు సమాయత్తం అనే కార్యక్రమంలో భాగంగా స్థానిక రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూక్ష్మ పోషకాల లోపాలు ఉన్నట్లయితే పంటల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని రైతులకు వివరించాలన్నారు. ఇనుము, మాంగనీస్, బోరాన్, కాపర్, జింక్, మెగ్నీషియం, క్లోరిన్, గంధకం అనే సూక్ష్మపోషకాలు, భూమిలో సమపాళ్లలో ఉండేలా చూసుకోవడానికి రైతులు ఈ భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించాలన్నారు. భూసార పరీక్షలు చేయించుకోవడం వలన భూమిలోని లోపాలను గుర్తించి ఏయే ఎరువులు ఎలా వాడుకోవాలో తెలుస్తుందని అవగాహన కల్పించాలన్నారు. జీవన ఎరువుల వాడకం వలన కలిగే ప్రయోజనాలు, సూక్ష్మపోషకాల లోపాల వలన వచ్చే తెగుళ్లను నివారించేందుకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు రైతులకు వివరించాలన్నారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను ఎక్కువగా వినియోగించడం వలన తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. పంట పొలంలో మట్టి నమూనాలను ఏ విధంగా సేకరించాలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో వీఏఏలు, వీహెచ్ఏలు గొంటు కృష్ణారెడ్డి, పవన్ కిశోర్, గొట్టం లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి


ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించి సూచనలు ఇస్తున్న జిల్లా మలేరియా అధికారి రవీంద్ర

సత్తెనపల్లి: నీటి నిల్వలు దోమలకు పుట్టినిల్లు అని, ఇంటి లోపల, ఇంటి బయట పరిసరాల్లో నీటి నిలువలు లేకుండా చూసుకోవాలని పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ అన్నారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా శుక్రవారం పట్టణంలోని వడ్డవల్లి ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెంకటపతి కాలనీ, 10వ సచివాలయం కబేళా బజార్ ఏరియాలోని వివిధ ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగే తీరును పరిశీలించి ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వల్ల కీటక జన వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడువాపు, బోదకాలు వంటివి వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో సచివాలయ ఆరోగ్య సిబ్బంది, శానిటరీ, మలేరియా సిబ్బంది పాల్గొని ఇంటింటికి తిరిగి దోమలు వృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో పట్టణ మలేరియా అధికారి బి.పి. చంద్రశేఖర్, సూపర్‌వైజర్లు వై.రాజేష్ పాల్, కె.వి.నాగమల్లేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్లు ఎంపీ కిరణ్‌బాబు, షేక్ హుస్సేన్, షేక్ షరీఫ్, సచివాలయ హెల్త్ సెక్రటరీ భాగ్యరేఖ, ఆశా కార్యకర్త షేక్ పర్వీన్, తదితరులు ఉన్నారు.

మాజీ ఐఎంఏ అధ్యక్షుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం


మాజీ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి భార్య వెంకటలక్ష్మికి చెక్కు అందజేస్తున్న సభ్యులు

పిడుగురాళ్ల: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిడుగురాళ్ల శాఖ మాజీ అధ్యక్షులు డాక్టర్ చల్లా వెంకటేశ్వరరెడ్డి ఇటీవల మరణించటంతో ఆయన కుటుంబ సభ్యులకు ఐఎంఏ అసోసియేషన్ ద్వారా రూ.11,24,500 చెక్కును అందజేసినట్లు ఐఎంఏ పిడుగురాళ్ల అధ్యక్షులు డాక్టర్ ధూళ్లిపాళ్ల భరత్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ చల్లా వెంకటేశ్వరరెడ్డి 1983 నుంచి పిడుగురాళ్ల పట్టణ ప్రజలకు వైద్య సేవలు అందించి, ఇటీవలే మృతి చెందారు. ఆయన ఐఎంఏ నేషన్ సోషల్ సెక్యూరిటీ టీమ్ సభ్యులుగా కూడా పని చేశారు. ఆయన అకాల మృతి తీరని లోటని తెలిపారు. ఆయన భార్య వెంకటలక్ష్మికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ద్వారా రూ.11,24,500 చెక్కు అందించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చల్లా వెంకటేశ్వరరెడ్డి పెద్ద కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి డాక్టర్ బొర్రా రాంప్రసాద్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ శ్రీధర్, సీనియర్ ఐఎంఏ సభ్యులు డాక్టర్ కేవీ సుబ్బారావు, డాక్టర్ సీసీ సుబ్బారావు, డాక్టర్ ఆళ్ల సాంబశివరావు, మందపాటి కోటిరెడ్డి, డాక్టర్ లక్ష్మీనారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

ఉల్లాసంగా .. ఉత్సాహంగా

- క్రీడలు వ్యాయామాల్లో నిమగ్నం
- ఆనందం వ్యక్తం చేస్తున్న చిన్నారులు
- సెలవులను ఎంజాయ్ చేస్తున్న విద్యార్థులు


పొట్టి శ్రీరాములు మున్సిపల్ పార్క్ వద్ద ఓపెన్ జిమ్‌లో చిన్నారుల సందడి

సత్తెనపల్లి: గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులు, క్రీడాకారులు వేసవి సెలవులను ఎంజాయ్ చేస్తున్నారు. ఇందుకు పట్టణంలో ఏర్పాటు అయిన మున్సిపల్ పార్కులు, ఓపెన్ జిమ్‌లు, డాక్టర్ పీఎం రెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ తదితర ప్రాంతాలు వేదిక అయ్యాయి. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు సైతం ఇక్కడకు వచ్చి సరదాగా గడుపుతున్నారు. వేసవి సెలవులు కావడంతో ప్రతిరోజు పిల్లలు, యువకులతో ఆయా ప్రాంతాలు కోలాహలంగా మారుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఎన్నికల ప్రచారంలో తలమునకలైన వారు సైతం కుటుంబ సమేతంగా పార్కుల బాట పట్టి సేద తీరుతున్నారు. గుంటూరు రోడ్‌లో నూతనంగా డాక్టర్ పీఎం రెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడంతో అక్కడ స్విమ్మింగ్, బాక్స్ క్రికెట్ తదితర వాటిల్లో పిల్లలు, క్రీడాకారులు ఆనందానికి హద్దే లేదు. ఆట వస్తువులతో ఆడుతూ పాడుతూ సరదా సరదాగా గడుపుతున్నారు. ఈ దృశ్యం చూడ ముచ్చటగా ఉంది. రిటైర్డ్ ఉద్యోగులు, వృద్ధులు, వావిలాల స్మృతి వనంలో పచ్చని చెట్ల మధ్య ప్రశాంత వాతావరణంలో స్వచ్ఛమైన గాలిని పీలుస్తూ సేద తీరుతున్నారు. యువకులు, చిన్నారులు ఓపెన్ జిమ్‌తో సాధనలు చేయగా కొందరు వాకింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటున్నారు. ఈ వేసవి సెలవులను అందరు హాయిగా ఆనందంగా, సంతోషంగా ఎంజాయ్ చేస్తున్నారు.